# ఇంద్రారెడ్డి ఆశయాల సాధనకు కృషి



తాండూరు రూరల్, ఏప్రిల్ 22 : దివంగత మాజీ హోంమంత్రి పి.ఇంద్రారెడ్డిని స్ఫూర్తిగా తీసుకోవాలని మహేశ్వరం ఎమ్మెల్యే, మాజీ మంత్రి, సబితాఇంద్రారెడ్డి సోదరుడు జి.నర్సింహా రెడ్డి అన్నారు. మంగళవారం తాండూరు మండలం, కోటబాసుపల్లిలోని ఇంద్రారెడ్డి 25వ వర్ధంతిని పురస్కరించుకొని విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంద్రారెడ్డి ఆశయ సాధన కోసం సబితారెడ్డితోపాటు కుటుంబ సభ్యులందరం ముందుకు సాగుతున్నామని తెలిపారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కార్మిక, హోంమంత్రిగా ఈ ప్రాంత అభివృద్ధికి ఎంతో కృషి చేశారని గుర్తు చేశారు. తెలంగాణ సాధన కోసం అనేక పోరాటలు చేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఇంద్రారెడ్డి ట్రస్టీ సభ్యులు, జి.రాజశేఖర్‌రెడ్డి, నాగప్ప(టీచర్), హెచ్‌ఎం శ్రీనివాస్ విజయ సారధి, శ్రీనివాస్‌రెడ్డి, వివి రెడ్డి, గ్రామస్తులు బురానొద్దీన్, విగ్నేష్, గౌసోద్దీన్, రాజు, కొండన్‌రవి, నర్సింహులు, బాల్‌రాజ్, సాయప్ప, సురేశ్, అశోక్ తదితరులు ఉన్నారు.

**నవాబుపేట:** ఇంద్రారెడ్డి వర్ధంతి సందర్భంగా ఆయన స్వ గ్రామం కౌకుంట్లలోని ఆయన సమాధి వద్ద నవాబుపేట మండల బీఆర్‌ఎస్ నేతలు నివాళులర్పించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి, జనరల్ సెక్రటరీ పోలీస్ మహేశ్వర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ రైతు సంఘం అధ్యక్షుడు జగన్‌రెడ్డి, ఎస్సీ సెల్ విభాగం రాజు, ముకుంద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మాణిక్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, విఠల్‌రెడ్డి, కార్యకర్తలు ఉన్నారు.

# చట్టాలపై అవగాహన కలిగియుండాలి



సమావేశంలో మాట్లాడుతున్న షీ టీం ఇన్‌చార్జీ నర్సింహులు

పరిగి, ఏప్రిల్ 22 : చట్టాలపై అవగాహన కలిగి ఉండడంతోపాటు, ఏ చిన్న ఇబ్బంది కలిగినా వెంటనే తమకు సమాచారం అందించాలని పరిగి షీ టీం పరిగి సబ్ డివిజన్ ఇన్‌చార్జి నర్సింహులు విద్యార్థినులకు సూచించారు. మంగళవారం పరిగి మండలం నస్కల్‌లోని కేజీబీవీని పాఠశాలలో షీ టీం ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ఆకతాయిలు ఎవరైనా అనుచితంగా ప్రవర్తిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామన్నారు. బ్యాంకింగ్ ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, తమ కుటుంబసభ్యులకు అవగాహన కల్పించాలన్నారు. బాల్య వివాహాలు చేయడం నేరమని, ఎక్కడైనా బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. నిర్భయ చట్టం, మానవ అక్రమ రవాణా, మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ క్రైమ్ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల స్పెషల్ ఆఫీసర్ సఫియా సుల్తానా, షీ టీం సభ్యులు మనీషా, శోభరాణి పాల్గొన్నారు.

# ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు




యాలాల్, ఏప్రిల్22 : ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలలో విద్యా బోధన జరగడంతో పాటు ర్యాంకులలో పోటీపడడం ఎంతో హర్షనీయమని మాజీ ఎంపీపీ బాలేశ్వర గుప్తా, మాజీ జెడ్పీటీసీ సిద్రాల శ్రీనివాస్, ఎంఈఓ రమేశ్, పీఆర్‌టీయూ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్ (బాలుర) పాఠశాల వార్షికోత్సవం హెచ్‌ఎం సిద్రామేశ్వర్ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ సోషల్ వెల్ఫేర్ అధికారి వీరానందం, మాజీ ఎంఈవో సుధాకర్ రెడ్డి, పీఆర్‌టీయూ కార్యదర్శి రాములు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# బడిబాటలో పిల్లల తల్లిదండ్రులకు అవగాహన



దోమ, ఏప్రిల్ 22: పిల్లలను ప్రభుత్వ బడిలో చేర్పించేందుకు తల్లిదండ్రులు మొగ్గు చూపాలని దోమ మండల విద్యాధికారి వెంకట్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని దిర్సంపల్లి, ఐలాబాద్ తండా, గోవింద్ బుద్యా తండా, బట్లచందారం గ్రామాలలోని ప్రాథమిక పాఠశాలల ఆధ్వర్యంలో ఎంఈవో వెంకట్ బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పిల్లల తల్లిదండ్రులకు అవగహన కల్పిస్తూ గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటుకు దీటుగా ఉండేందుకు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రీ ప్రైమరీ, నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు ఈ విద్యా సంవత్సరం నుంచి ప్రారంభమవుతున్నాయని తెలిపారు. విద్యార్థులకు ఇంగ్లిష్ మీడియంతో పాటుగా డిజిటల్ బోధనను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు,విద్యార్థులు వారి తల్లి దండ్రులు, యువకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# తాగునీటి సమస్య రాకుండా చూడాలి



బషీరాబాద్, ఏప్రిల్ 22 : గ్రామంలో తాగునీటి ఎద్దడి, పారిశుధ్య సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాలని గ్రామ ప్రత్యేకాధికారి, తహసీల్దార్ వై. వెంకటేశ్ అన్నారు. మంగళవారం గ్రామ పంచాయతీ ఆవరణలో గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుధ్య పనులు, విద్యుత్ సమస్యలు, వీధి లైట్లు, ఉపాధి హామీ పనులు, నర్సరీ నిర్వహణ సక్రమంగా అమలు చేయాలన్నారు. ప్రతి రోజు గ్రామంలో చెత్త సేకరణ కార్యక్రమం జరగాలన్నారు. ఎండ కాలంలో తాగు నీటి అవసరం చాలా ఉంటుందని పైపులైన్‌లు లీకేజీలు లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి సూచించారు. వీధి లైట్లు లేని చోట ఏర్పాటు చేయాలన్నారు. నర్సరీ మొక్కలు ఎండి పోకుండా రెండు పూటల నీళ్లు పట్టాలన్నారు. ఉపాధి హామి పనులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామ నాయకుడు బిచ్చిరెడ్డి, పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

## వ్యర్థరహిత గ్రామాలుగా మార్చాలనే

# లక్ష్యానికి తూట్లు ..

పరిగి, ఏప్రిల్ 22: పరిశుభ్రత, పచ్చదనంతో చక్కటి ఆహ్లాదకరమైన వాతా వరణం నెలకొల్పాలన్నది గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆలోచన. అందుకు అను గుణంగా పల్లెల్లో సైతం ప్రతి రోజు ఇంటింటి నుంచి తడి, పొడి చెత్తను వేర్వేరుగా చేయించి సేకరించి డంపింగ్‌యార్డులకు చేరవేసేవారు. ప్రతిరోజు సేకరించిన చెత్తను వేర్వేరు చేసి తడి చెత్తతో వర్మీ కంపోస్టు ఎరువు తయారు చేయించి మొక్కలకు వేయడం, బయటి వారికి అవసరమైతే విక్రయించడం ద్వారా ఆదాయం పెంపొందించుకోవడం జరిగేది. చెత్త సేకరణకు ప్రతి గ్రామ పంచాయతీకి ఒక ట్రాక్టర్, నీటి కోసం ట్యాంకర్ సైతం కొనుగోలు చేసి అన్ని విధాలుగా రోజు ఒక ప్రణాళికా బద్ధంగా చెత్త సేకరణ, ఇతర కార్యక్రమాలు జరిగేవి. అవన్నీ గతం అనే విధంగా నేడు గ్రామాల్లో పరిస్థితులు తయారయ్యాయి. చెత్త సేకరణ తో పరిసరాలు పరిశ్రుభంగా ఉండేవి.

నేటికీ గ్రామాల్లో గ్రామపం చాయతీ ట్రాక్టర్ ఉన్నప్పటికీ చెత్త సేకరణ దగ్గర నుంచి వర్మీ కంపోస్టు ఎరువు తయారీ వరకు నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తున్నది. వ్యర్థ రహిత గ్రామాలుగా మార్చాలనే లక్ష్యానికి నేటి పాలకులు తూట్లు పొడుస్తున్నారనే విమర్శలున్నాయి. ఉదాహరణకు పరిగి మండలం చిగురాల్‌పల్లి గ్రామాన్ని తీసుకుంటే. అక్కడ చెత్త సేకరణ గతంలో వలె కాకుండా రెండు మూడు రోజులకు ఒకసారి సేకరణ జరుగుతుంది. సేకరించిన చెత్తను డంపింగ్ యార్డులో పారవేయడం తప్ప మరోటి జరగడం లేదు. డంపింగ్‌యార్డుకు సరైన స్థలం లేక ఓ ప్రైవేటు స్థలంలో చెత్తను వేస్తున్నారు. అక్కడితో తమ పని అయి పోయిందన్నట్లుగా గ్రామపంచా యతీ కార్యదర్శి చేతులు దులుపుకుంటున్నారు.



ఓ ప్రైవేట్ స్థలంలో వేసిన వ్యర్థాలు



ఖాళీగా ఉన్న చిగురాల్‌పల్లి సెగ్రిగేషన్ షెడ్డు

### వృథాగా పడివున్న సెగ్రిగేషన్ షెడ్డు..

గ్రామానికి సమీపంలో రహదారికి ఆనుకొని నిర్మాణం చేపట్టిన సెగ్రిగేషన్ షెడ్డు వృథాగా పడివున్నది. ప్రతిరోజు సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డులోని ఓ సిమెంటు ప్లాట్‌ఫారంపై వేసి అందులో నుంచి గాజు సీసాలు, ప్లాస్టిక్ డబ్బాలు, ఏవైనా పాత దుస్తులు ఉంటే వేర్వేరుగా చేసి తడి చెత్తను వేరు చేయాల్సి ఉంటుంది. ఏవైనా మద్యం సీసాలు, డబ్బాలుంటే పాత సామగ్రి వారికి విక్రయించే అవకాశం ఉండేది. పూర్తిగా దేనికి పనికిరాని చెత్తను డంపింగ్‌యార్డులో వేసేవారు. ఇందుకుగాను గ్రామపంచాయతీ సిబ్బంది ఒకరు ప్రతిరోజు సెగ్రి గేషన్ షెడ్డులోనే ఈ చెత్తను వేర్వేరు చేసే పనులు చేపట్టే వారు. గత కొన్ని నెల లుగా ఈ పనులేవి జరగడం లేదు. దీంతో సెగ్రిగేషన్ షెడ్డు పూర్తిగా ఖాళీగా కనిపిస్తున్నది. ఇటీవలి కాలంలో చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించిన ఆనవాళ్లు కనిపించడం లేదు.

### ఖాళీగా వర్మీ కంపోస్టు యూనిట్..

సేకరించిన చెత్తలో తడి చెత్తను వేరు చేసి కుళ్లిపోయిన కూరగాయలు, ఎండు టాకులు, అన్నం వంటివి సెగ్రిగేషన్ షెడ్డులో నిర్మాణం చేపట్టిన వర్మీ కంపోస్టు యూనిట్‌లో వేసి వర్మీ కంపోస్టు ఎరువు తయారీ చేపట్టాల్సి ఉంటుంది. ఇం దుకుగాను సుమారు నెల రోజులకు పైగా సమయం పడు తుంది. పూర్తిగా కుళ్లిపోయి వర్మీ కంపోస్టు ఎరువు తయారైన తర్వాత దాన్ని ఎండబెట్టి జల్లెడ సైతం పట్టేవారు. కానీ చిగు రాల్‌పల్లిలోని సెగ్రిగేషన్ షెడ్డులో గల వర్మీ కంపోస్టు తయారీ యూనిట్ ఖాళీగా దర్శనమిస్తుంది. ఇటీవలికాలంలో వర్మీ కంపోస్టు తయారు చేసిన దాఖలాలు సైతం లేవనే చెప్పాలి. ఇది కేవలం చిగురాల్‌పల్లికే పరిమితం కాకుండా చాలా గ్రామపంచాయతీలలో సెగ్రిగేషన్ షెడ్లు వృథాగా పడివున్నాయి. చెత్త సేకరణ చేశామా, డంపింగ్‌యార్డులో వేసామా అనే విధం గానే పరిస్థితి తయారైంది. తద్వారా లక్షలాది రూపాయలు వెచ్చించి నిర్మాణం చేపట్టిన సెగ్రిగేషన్ షెడ్లు నిరుపయోగంగా పడి ఉన్నాయి. దీనంతటికీ కారణం మండల స్థాయి, జిల్లా స్థాయి అధికారులు గ్రామాలను సందర్శించకపోవ డ మనేది వాస్తవం. ప్రతి గ్రామపంచాయతీకి ఒక ప్రత్యేకాధికారి ఉన్నప్పటికీ వారు గ్రామాలకు వెళ్లింది లేదు, గ్రామ పరి స్థితులపై అవగాహన ఉన్నది లేదన్నట్లుగా తయారైంది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లోపం, 'చెత్త'పై చిత్తశుద్ధి లోపమే ఇందుకు కారణంగా విమర్శలున్నాయి. ఇప్పటికైనా ఉన్నతా ధికారులు ఈ అంశంపై దృష్టి కేంద్రీకరించి సెగ్రిగేషన్ షెడ్లు ఉపయోగంలోకి తీసుకురావాలని ఆయా గ్రామాల వారు కోరుతున్నారు.



వృథాగా వర్మీ కంపోస్టు యూనిట్



బషీరాబాద్, ఏప్రిల్ 22 : రెండు రోజుల క్రితం గాలివానకు తాండూరు–బషీరాబాద్ ప్రధాన రోడ్డు మార్గంలో ఇరువైలా ఉన్న చెట్లు నవల్గా గేట్ సమీపంలో విరిగి పడ్డాయి. సంబంధింత అధికారులు ఎవరు కూడా అటువైపు రాకపోగా వాటిని తొలిగించలేదు. దీంతో ఆ మార్గం గుండా ప్రయాణించే ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. అదే మార్గంలో విధులకు హాజరయ్యేందుకు వస్తున్న ఎస్సై శంకర్ రోడ్డు మార్గం గుండా వచ్చే జీపు, ఆటో డ్రైవర్‌ల సహాయంతో రోడ్డుపై పడ్డ చెట్లను స్వయంగా తొలిగించారు.



బొంరాస్‌పేట, ఏప్రిల్ 22 : ప్రపంచ ధరిత్రి దినోత్సవం సందర్భంగా మంగళవారం దుద్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యాధికారి విజయరామరావు విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమి చల్లగా ఉండాలంటే మొక్కలను అధిక సంఖ్యలో నాటి వాతావరణ సమతుల్యతను పాటించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ముకుందరెడ్డి, రవీందర్‌గౌడ్, రమేశ్, మల్లప్ప, రవినాయక్, సుధాకర్‌రావు, శ్రీనివాస్, విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం



తిర్మలాపూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కులకచర్ల, ఏప్రిల్ 22 : రైతులకు గిట్టుబాటు ధరను కల్పించేందుకే ప్రభుత్వం ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసున్నదని కులకచర్ల మార్కెట్ కమిటి చైర్మన్ బీఎస్ ఆంజనేయులు, పీఏసీఎస్ చైర్మన్ కనకం మొగులయ్య, డీసీసీ ఉపాధ్యక్షుడు భీంరెడ్డిలు, బ్లాక్ బి అధ్యక్షుడు కర్రె భరత్‌కుమార్ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని తిర్మలాపూర్, ఇప్పాయిపల్లి, రాంపూర్ గ్రామాల్లో పరిగి ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాగా ధాన్యం కొనుగోలు కేంద్రాలు లేక రైతులు తీవ్ర ఇబ్బం దులు పడుతున్నారని, వెంటనే కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని నమస్తే తెలంగాణ గత రెండు రోజులుగా వికారాబాద్ జిల్లా ఎడిషన్‌లో ప్రచురించిన కథనానికి అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే మంగళవారం ఒక్కరోజే మండలంలో మూడు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేశారు.

### డీసీఎంఎస్ ఆధ్వర్యంలో..

**దోమ:** ప్రభుత్వ వరి కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా ఎదగాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. డీసీఎంఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని రైతు వేదికలో పార్టీ మండల అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి రైతులు, నాయకులతో కలిసి మంగళవారం వరి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ కార్య క్రమంలో పీఏసీఎస్ డైరెక్టర్ జాకటి వెంకటయ్య, గ్రంథాలయ సంస్థ మాజీ డైరెక్టర్ యాదయ్యగౌడ్, యువ నాయకుడు శివకుమార్‌రెడ్డి, వెంకటయ్య, షబ్బీర్, శేఖర్, జాకారం నారాయణ యువకులు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# సుద్ద తవ్వకాలపై పోలీసులకు ఫిర్యాదు

పెద్దేముల్, ఏప్రిల్ 22 : గుర్తు తెలియని వ్యక్తులు తమ సొంత భూమిలో సుద్ద తవ్వకాలు చేశారని రుద్రారం మహిపాల్‌రెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. మహిపాల్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం పెద్దేముల్ మండలం తింసన్‌పల్లి గ్రామ శివారులో గల తమ పట్టా భూమి 14 సర్వే నంబర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు అక్రమంగా సుద్ద తవ్వకాలు చేశారు. తవ్విన సుద్దను అక్కడి నుంచి తరలించారు. తమ సొంత పొలంలో తమకు తెలియకుండా అక్రమ సుద్ద తవ్విన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. మహిపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

# చలో వరంగల్ పోస్టర్ ఆవిష్కరణలు



కులకచర్ల, ఏప్రిల్ 22: ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభకు కులకచర్ల మండలం నుంచి భారీ సంఖ్యలో హాజరుకావాలని మండల బీఆర్‌ఎస్ పార్టీ నాయ కులు పేర్కొన్నారు. మంగళవారం కులకచర్ల మండల కేంద్రంలోని పెద్ద గేటు చౌరస్తాలో చలో వరంగల్ గోడపత్రికను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కులకచర్ల మండల రైతు బంధు సమితి మాజీ అధ్యక్షుడు కేబీ రాజు, మాజీ ఎంపీపీ రాజప్ప, మాజీ ఎంపీటీసీ మాలె కృష్ణయ్య గౌడ్, పాంబండ దేవాలయ మాజీ చైర్మన్ రాములు, బీఆర్‌ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గజ్జి లక్ష్మయ్య, నాయకులు రాములుగౌడ్, అంజిల య్య గౌడ్, వెంకటయ్య, శ్రీశైలం, సంజీవులుగౌడ్, మాజీ సర్పంచ్ రఘు, మాజీ ఎంపీటీసీ నందు, రాములు, గ్రామస్తులు జె వెంకటయ్య, పార్టీ సీనియర్ నాయకులు పాల్గొన్నారు.



**ధారూరు:** ఈ నెల 27న వరంగల్‌లో నిర్వహించనున్న రజ తోత్సవ సభని విజయవంతం చేయడానికి ప్రతి గ్రామం నుంచి భారీగా తరలిరావాలని అవుసుపల్లి, దోర్నాల్ గ్రామాల్లో బీఆర్‌ఎస్ నాయకులు అన్నారు. మంగళవారం ధారూరు మండల మండల పరిధిలోని అవుసుపల్లి, దోర్నాల్ గ్రామాల్లో చలో వరంగల్ వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు .

# సత్తా చాటిన ప్రభుత్వ విద్యార్థులు

పరిగి, ఏప్రిల్ 22: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం ఫలితాలలో పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల ఉత్తమ ఫలితాలు సాధించి మొదటి స్థానంలో నిలిచింది. వికారాబాద్ జిల్లాలో 13 ప్రభుత్వ జూనియర్ కళాశాలలున్నాయి. పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలకు 106 మంది విద్యార్థులు హాజరవగా 78 మంది ఉత్తీర్ణులయ్యారు. తద్వారా జిల్లాలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో ద్వితీయ సంవత్సరం ఫలి తాల్లో పరిగి కళాశాల మొదటి స్థానంలో నిలిచినట్లు కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమార్ తెలిపారు. ప్రథమ సంవత్సరం పరీక్షలకు 158 మంది హాజరవగా 75 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. పరిగి ప్రభుత్వ కళాశాలకు చెందిన సీహెచ్ పూజిత ఎంపీసీ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను 953 మార్కులు సాధించారు. ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో జి.భవానీ 470 మార్కులకుగాను 463 మార్కులు సాధించారు.

**వికారాబాద్:** వికారాబాద్ జిల్లా కేంద్రంలోని శివారెడ్డిపేట (తెలంగాణ బాలికల మైనార్టీ కళాశాల)కు చెందిన విద్యార్థి అఫ్షా తరన్నుమ్ బీపీసీ 907 మార్కులతో సత్తా చాటింది.

**కులకచర్ల:** బండవెల్కిచర్ల గిరిజన గురుకుల కళాశాలకు చెందిన ద్వితీయ సంవత్సరం విద్యార్థులు విఘ్నేశ్వర్‌రెడ్డి ఎంపీసీలో 945, బైపీసీలో 893, మొదటి సంవత్సరంలో నవీన్‌కుమార్ ఎంపీసీలో 458, బైపీసీలో గణేశ్ 338 మార్కులు సాధించారు. ముజాహిద్‌పూర్ మోడల్ స్కూల్‌లో బైపీసీ ద్వితీయ సంవత్సరంలో ప్రహ్లాద్ 941, అశ్విని 904, ఎంపీసీ ప్రథమ సంవత్సరంలో సాయి కార్తీక్‌గౌడ్ 453, సీఈసీలో బీఎస్ సింధులత 356, కులకచర్ల కేజీబీవీలో 64 శాతం, బండవెల్కిచర్ల ఆశ్రమ పాఠశాలలో 85శాతం విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

**దోమ:** మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ . కళాశాల నుంచి ప్రథమ సంవత్సరంలో 103 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 49 మంది ఉత్తీర్ణత సాధించగా, ద్వితీయ సంవత్సరంలో 84 మంది విద్యార్థులకు గాను 45 మంది ఉత్తీర్ణత సాధించారని ఆమె పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరంలో కళాశాల నుంచి ఎంపీసీలో ఎ అనీల్ 942 మార్కులు సాధించగా బైపీసీలో సిద్దార్థ 881 మార్కులు, సీఈసీలో నాగలక్ష్మి 802,హెచ్‌ఈసీలో మొహమ్మద్ జునైద్ 904 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబరచగా, ప్రథమ సంవత్సరంలో ఎంపీసి నుంచి అనుషా 453 మార్కులు,బైపీసిలో వైష్ణవి 404, సీఈసిలో కౌశల్యా, రవితేజలు 442, హెచ్‌ఈసీలో శిరీష 436 మార్కులతో ఉత్తమ ప్రతిభ సాధించినట్లు ప్రిన్సిపల్ తెలిపారు.

**కొడంగల్:** కొడంగల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మొదటి సంవత్సరంలో ఎంపీసీలో 66శాతం, బైపీసీలో 60శాతం, హెచ్‌ఈసీ తెలుగు మీడియంలో 47శాతం, సీఈసీలో 47 శాతం, హెచ్‌ఈసీ ఉర్దూ మీడియంలో 47శాతం ఉత్తీర్ణతలు సాధించారు. అదేవిధంగా ద్వితీయ సంవత్సరంలో ఎంపీసీలో 60శాతం, బైపీసీలో 70శాతం, హెచ్‌ఈసీ తెలుగు మీడియంలో 57శాతం, సీఈసీలో 55శాతం, హెచ్‌ఈసీ ఉర్దు మీడియంలో 82శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. కస్తూర్బాగాంధీ కళాశాలలోని ప్రథమ సంవత్సరం బైపీసీలో 83శాతం, ఎంపీసీలో 59శాతం పాసైయ్యారు. ద్వితీయ సంవత్సరంలో బైపీసీ 95శాతం, ఎంపీసీ 81శాతం ఉత్తీర్ణులయ్యారు. ఈ కళాశాలలో మొత్తంగా బైపీసీలో 13 మందికి 900లకు పైగా, ఎంపీసీలో నలుగురికి 900లకు పైగా మార్కులు సాధించడం పట్ల ఆ కళాశాల ఎస్‌వో శ్రవంతి విద్యార్థులు అభినందించారు. గిరిజన గురుకుల కళాశాలలో మొదటి సంవత్సరం లో 62 శాతం, ద్వితీయ సంవత్సరంలో81శాతం పాసైయ్యారు. దౌల్తాబాద్ మండంలోని ఎంజేపీ గురుకుల పాఠశాల నుంచి 991మార్కులు సాధించి నియోజకవర్గ పరిధిలో అనిల్ కుమార్ టాపర్‌గా నిలవడం పట్ల ఆ కళాశాల అధ్యాపకులు విద్యార్థిని అభినందించారు.

### స్పౌజ్, మ్యూచువల్ బదిలీలు

పరిగి, ఏప్రిల్ 22: పరిగి మండలంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు సంబంధించి స్పౌజ్, మ్యూచువల్ బదిలీలు నిర్వహించినట్లు ఎంఈవో గోపాల్ తెలిపారు. పరిగి మండలంలోని నజీరాబాద్ ప్రాథమిక పాఠశాలలో ఒకరు, ప్రాథమిక పాఠశాల నర్సయ్యగూడలో ఒకరు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రాపోల్‌ల నుంచి ఇరువురు ఉపాధ్యాయులు, జిల్లా పరిషత్ రూప్‌ఖాన్‌పేట్ నుంచి ఒకరిని మ్యూచువల్, స్పౌజ్ కేటగిరిలలో బదిలీ ఉత్తర్వులు ఇస్తూ రిలీవ్ చేసినట్లు తెలిపారు.

### సూపర్ మార్కెట్‌కు జరిమానా

వికారాబాద్, ఏప్రిల్ 22 :సూపర్ మార్కెట్లలో కాలం చెల్లిన వస్తువులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఏసుదాసు హెచ్చరించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని స్మార్ట్ పాయింట్ సూపర్ మార్కెట్‌ను మున్సిపల్ అధికారులు తనిఖీ చేశారు. కాలం చెల్లిన వస్తువులు ఉండటంతో రూ.10వేల జరిమానా విధించారు. ఆయనతో పాటు పర్యావరణ అధికారి శ్రీనివాస్, శానిటరీ జవాన్లు వినోద్‌కుమార్, శంకర్, చిన్నయ్య, రాజు, ఆశయ్య, మహేందర్ ఉన్నారు.

### మంగళ సూత్రాలు అందజేత

పరిగి, ఏప్రిల్ 22: శ్రీ సత్యసాయి సేవా కేంద్రం రంగాపూర్ ఆధ్వర్యంలో ఇరువురు పేదల పెండ్లి కోసం మంగళవారం మంగళ సూత్రాలు అందజేశారు. కోస్గి మండలం తోగాపూర్‌కు చెందిన భారతి, పరిగి మండలం రంగాపూర్‌తాండకు చెందిన నందినికి మంగళసూత్రాలు పంపిణీ చేశారు. ఇప్పటివరకు 88 మందికి మంగళ సూత్రాలు అందజేసినట్లు సత్యసాయి సేవకులు వెంకట్‌రెడ్డి తెలిపారు.

### బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

పెద్దేముల్, ఏప్రిల్ 22 : మండల పరిధిలోని గాజీపూర్ గ్రామంలో ఇటీవల విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో ఫొటో గ్రాఫర్ సరగళ్ల శ్రీనివాస్ ఇంట్లో ఉన్న కంప్యూటర్లు గృహోపకరణాలు , వంట సామగ్రి అన్ని దగ్ధమైపోయిన విషయం తెలిసిందే. కాగా గ్రామంలోని యువకులందరూ కలిసి శ్రీనివాస్ కుటుంబానికి రూ. 10 వేలు ఆర్థిక సాయం చేశారు. కాంగ్రెస్ నేత మురళీ కృష్ణగౌడ్ రూ. 10 వేలు అంద చేశాడు.

### పెండ్లికి సరుకుల సాయం

కులకచర్ల, ఏప్రిల్ 22 :మండల పరిధి లోని పటేల్‌చెరువుతండా గ్రామ పంచాయతీ పరిధిలోని మంచికుంట తండాకు చెందిన కేతావత్‌లక్ష్మి, రాముల కుమార్తె అంబిక వివాహానికి గ్రామ మాజీ సర్పంచ్ శాంతి తులసీరాం తనవంతు సాయంగా క్వింటాలు సోనామసూరి బియ్యం, 15 కిలోల మంచినూనె అందించారు. కార్యక్ర మంలో గ్రామ బీఆర్‌ఎస్ నాయకులు తులసీరాం నాయక్, తాండావాసులు లోకేష్, రాహుల్, శంకర్, హన్మంతు, లక్ష్మణ్, గోపాల్, కుమార్, గ్రామస్తులు పాల్గొన్నారు.

### ఘనంగా లెనిన్ జయంతి

వికారాబాద్, ఏప్రిల్ 22 : లెనిన్ స్ఫూర్తితో సమ సమాజ స్థాపన కోసం పోరాడుదామని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి వై.మహేందర్ తెలిపారు. మంగళవారం వికారాబాద్ జిల్లా కేంద్రంలోని అతిథి గృహంలో లెనిన్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లెనిన్ జన్మదినాన్ని పార్టీ పుట్టినరోజుగా నిర్వహించుకుం టున్నట్లు వివరించారు. కార్యక్రమంలో పీవోడబ్ల్యూ రాష్ట్ర కార్యదర్శి గీత, సీపీఐ(ఎంఎల్) న్యూ డెమోక్రసీ జిల్లా నాయకుడు పి మల్లేశ్, ఏఐకేఎంఎస్ జిల్లా నాయకుడు రాములు, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు పి. శ్రీనివాస్, రాజేష్ , శ్రీకాం త్, అశోక్ , శివన్న, ప్రభావతి, వరమ్మ, మహేందర్, మాణిక్యం పాల్గొన్నారు.

### నూతన కార్యవర్గం

వికారాబాద్, ఏప్రిల్ 22 : మాస్టర్స్ అథ్లెటిక్ అసోసియేషన్ వికారాబాద్ జిల్లా నూతన కార్యవర్గం అధ్యక్షుడిగా కె. శ్రీనివాస్ గౌరవ అధ్యక్షుడిగా రాజరెడ్డి , ప్రధాన కార్యదర్శిగా మొరంగపల్లి అశోక్‌లను మంగళవారం జిల్లా కేంద్రంలో ఎన్నికయ్యారు. కార్యక్రమంలో భాగంగా కార్యవర్గ ఉపాధ్యక్షులుగా ఐ గోపాల్ రెడ్డి, జాయింట్ సెక్రటరీ గా వరప్రసాద్, సలహాదారులుగా ఆంజనేయులు, నారాయణరావు, సంఘ మేశ్వర్, రాంచందర్, మల్లయ్య, సత్తయ్య, ట్రెజరీ రాంచంద్రయ్య మీడియా కన్వీనర్ విజయకుమార్, వర్కింగ్ ప్రసిడెంట్ భాస్కర్, నరేందర్, మహిళా ఉపాధ్యక్షులు అనురాధ, మహిళా కార్యదర్శి సంతోషి కుమారి, సభ్యులు పాల్గొన్నారు. యువతకు ఆటల పట్ల అవగాహన కల్పించేం దుకు ఈ అసోసియేషన్ ఏర్పాటు చేసినట్లు వారు తెలిపారు.

**PUBLIC NOTICE**

The General Public are hereby informed that my client T.Revanth Reddy, S/o. T.Raghava Reddy, R/o. Hyderabad, entered into an agreement with Kalyankar Narender, S/o. Naranji, R/o. H.No. 4-20, Kandukur, Nednur, R.R. District to purchase the agricultural dry land, in Sy.No.s 81/అ/2అ/2, 81/అ/ఈ, 81/అ-2, 81/అ-2, admeasuring Ac. 0-10 gts., Ac. 0-20 gts., Ac. 0-20 gts. & Ac. 0-10 gts. respectively, situated at Nyamathapur Village, Kadthal Mandal, R.R. District and paid sufficient amount as advance.

If any person/s have any objections for the above transaction may approach the under signed with relevant documents within 7 days hereof. Failing which my client will complete the sale transaction.

**K.GOVARDHAN REDDY, Advocate**
H.No. 1-6-430/1, Zamistanpur, Musheerabad, Hyderabad-500 020,
**Ph: 9848138076.**